సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

క్లుప్తంగా

సిక్కుల ఆత్మీయ సమావేశం



కె.కె.రాజును సత్కరిస్తున్న సిక్కులు

సీతమ్మధార: సిక్కు వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ ఆనంద్‌సింగ్ ఆధ్వర్యంలో బుధవారం 24వ వార్డు పీ అండ్ టీ కాలనీలోని ఆయన నివాసంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతోందన్నారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆత్మీయ సమావేశంలో సిక్కు కుటుంబ సభ్యులతో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, పార్టీ సీనియర్ నాయకురాలు, తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ లక్ష్మీపార్వతి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మాజీ ఎమ్మెల్యే పిన్నింటి వరలక్ష్మి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కె.కె.రాజుకు మహిళల మద్దతు



కె.కె.రాజును సత్కరిస్తున్న మహిళలు

సీతంపేట: వైఎస్సార్‌సీపీ నాయకురాలు మల్లేశ్వరి ఆధ్వర్యంలో అక్కయ్యపాలెంలోని సెలబ్రేషన్ హోటల్‌లో బుధవారం మహిళా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్ని రంగాల్లో మహిళలకు పెద్దపీట వేశారన్నారు. మహిళా సాధికారత నుంచి అన్ని రకాల పదవుల్లో ప్రాధాన్యం కల్పించారని చెప్పారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా మహిళలంతా కె.కె.రాజును ఘనంగా సత్కరించి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కె.సుశీల, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

శేషేంద్రుడు యుగకవి



ప్రసంగిస్తున్న సోమయాజులు

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో 'యుగీన శ్వాసల కవీంద్రుడు శేషేంద్రుడు' అనే అంశంపై సాహితీ ప్రసంగ కార్యక్రమం జరిగింది. కవి, ముఖ్య వక్త వి.ఎస్.ఆర్.ఎస్.సోమయాజులు(కాకినాడ) మాట్లాడుతూ ప్రముఖ తెలుగు కవి శేషేంద్ర తన కవిత్వంలో ఆధునిక భావజాలం, సంప్రదాయ కవిత్వం సమ్మిళితంగా అనేక రచనలు చేసి ముందు తరాలకు అందించారన్నారు. ముఖ్యంగా రామాయణ షోడసి, స్వర్ణహంస, రుతుఘోష కావ్యాలు తెలుగు సాహిత్యంలో తరతరాలకు నిలిచే సాహిత్య సంపదలని ప్రశంసించారు. ఎన్నో పాటలు, గజల్స్, విప్లవ నాటికలు కూడా రాశారని, శేషేంద్ర యుగకవి అని అభివర్ణించారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ అభ్యుదయ భావ దృక్పథంతో యువతకు కవితా నిర్దేశం చేసిన కవి శేషేంద్ర అన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ శేషేంద్ర రాసిన కవిసేన మేనిఫెస్టో ద్వారా కవులకు మార్గనిర్దేశం చేసారని పేర్కొన్నారు. రచయితలు కె.జి.వేణు, కేశనాపల్లి రాంప్రసాద్, కుప్పిలి భీమేశ్వరరావు, అయ్యల సోమ యాజుల ప్రసాద్, వేదుల కామేశ్వరశర్మ, ఉండవిల్లి సుజాతామూర్తి, బి.రాధారాణి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరికల పరంపర



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన పార్టీల యువకులు, మహిళలతో ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు



50, 53 వార్డులకు చెందిన యువకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కె.కె.రాజు

'ఉత్తర'లో బలపడుతున్న కె.కె.రాజు

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీలోకి ఇతర పార్టీల నుంచి చేరికల పరంపర కొనసాగుతోంది. దీంతో ఆ పార్టీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు మరింత బలపడుతున్నారు. 26వ వార్డు లలితానగర్‌కు చెందిన టీడీపీ, జనసేన పార్టీల నుంచి యువకులు, మహిళలు బుధవారం కె.కె.రాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత చేరిక శుభపరిణామం

జీవీఎంసీ 50, 53 వార్డులకు చెందిన పలువురు యువత వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. 50వ వార్డుకు చెందిన పూజారి అమర్‌నాథ్, 53వ వార్డు నుంచి స్టార్ యూత్ ఆధ్వర్యంలో యువకులు పార్టీలో చేరి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ తమ పార్టీలో యువత చేరడం శుభపరిణామన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని కోరారు. ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, మాజీ కార్పొరేటర్ జి.వి.రవిరాజు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి చేశాం



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

- జగన్‌ను మళ్లీ ఆదరిస్తే మరింత చేస్తాం
- వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు
- జోరుగా ఎన్నికల ప్రచారం

మద్దిపాలెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యపడతాయని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. 53వ వార్డు మద్దిపాలెం శివనగర్, నరేంద్రనగర్ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ బర్కత్ అలీ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు. నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో సుపరిపాలనకు మద్దతివ్వాలని, అందరూ సహకరిస్తూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి, సీనియర్ నాయకుడు జి.వి.రవిరాజు, పార్టీ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి, తుళ్లి చంద్రశేఖర్ యాదవ్, షేక్ బాబ్జి, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు

53వ వార్డులో జరిగిన ఎన్నికల ప్రచారంలో శివనగర్‌కు చెందిన పలువురు టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ప్రతి ఒక్కరూ పార్టీ విజయానికి సహకరించాలని ఆయన కోరారు.

డెవలప్‌మెంట్ వాచ్

బ్యూటిఫుల్ బస్ బే



గురుద్వారా కూడలి వద్ద నిర్మించిన ఆధునిక బస్ షెల్టర్, ప్రయాణికుల కోసం టాయిలెట్లు

విశాఖ అభివృద్ధి, బ్యూటిఫికేషన్‌లో భాగంగా ఆధునిక బస్ బేలు నిర్మించారు. సత్యం జంక్షన్ నుంచి ఆర్ అండ్ బీ కూడలి వరకు జాతీయ రహదారికి ఇరువైపులా ఉత్తర నియోజకవర్గం విస్తరించి ఉంది. గతంలో **హైవేపై** బస్సుల కోసం నిరీక్షించే వారికి సరైన షెల్టర్లు లేక.. ఎండను తాళలేక ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ సమస్య పరిష్కారమైంది. పార్టీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు చొరవతో నియోజకవర్గంలో సుమారు రూ.1.61 కోట్లతో తొమ్మిది చోట్ల స్మార్ట్ బస్ బేలు నిర్మించి, ప్రయాణికుల సౌకర్యార్థం వాటికి ఆనుకొని టాయిలెట్లు ఏర్పాటు చేశారు.

– సీతంపేట



రూ.26.90 లక్షలతో నిర్మించిన అక్కయ్యపాలెం నార్త్ బస్ బే



రూ.26.90 లక్షలతో నిర్మించిన అక్కయ్యపాలెం సౌత్ బస్ బే



పోర్టు హాస్పిటల్ వద్ద నిర్మించిన ఆధునిక బస్ బే

యాత, శెట్టిబలిజలకు అండగా ఉంటా..

- ఆత్మీయ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కె.కె.రాజు

మద్దిపాలెం: ఉత్తరాంధ్ర అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే సాధ్యపడుతుందని, యాత, శెట్టిబలిజ కులస్తులకు తాము అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు భరోసా ఇచ్చారు. ఉత్తరాంధ్ర యాత సంఘం అధ్యక్షుడు పిల్లి నూకరాజు, రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాతల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి బిర్లా జంక్షన్ దరి ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన యాత, శెట్టిబలిజ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల పాలనలో అందులో రెండేళ్ల కరోనా వంటి క్లిష్టపరిస్థితుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా ఉంటూ సంక్షేమ పథకాలు అందించిందన్నారు. యాత, శెట్టిబలిజ వర్గానికి సంబంధించి గతంలో పిల్లి సుభాష్ చంద్రబోస్‌కు రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించారని గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు స్కూళ్లకు దీటుగా మార్చి, పేదలకు విద్యా వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు.

కూటమి పార్టీలను తరిమికొట్టండి

ఉత్తరాంధ్ర వెనుకబాటుతనానికి కారకులైన బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలకు ఓటుతోనే సమాధానం చెప్పి తరిమికొట్టాలని కె.కె.రాజు పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి అందరూ సహకరించి, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. యాత, శెట్టిబలిజల డిమాండ్ల సాధనతో కూడిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. వారి ప్రతి ఒక్క సమస్యను పరిష్కరిస్తామని కె.కె.రాజు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శెట్టిబలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రాయుడు శ్రీనివాసరావు, సంపంగి శ్రీను, రాయుడు రవి, యాత, శెట్టిబలిజల సభ్యులు, భారీగా మహిళలు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం నేడు

డాబాగార్డెన్స్: జోన్–3 పరిధిలో ప్రధాన పైప్‌లైన్ మరమ్మతుల నిమిత్తం 22వ వార్డు(పార్టు) న్యూ రేసపువానిపాలెం, 23వ వార్డు(పార్టు) మద్దిలపాలెం, కృష్ణా కాలేజ్ రోడ్డు, మద్దిలపాలెం ఆర్టీసీ డిపో రోడ్డు, 24వ వార్డు(పార్టు) చైతన్యనగర్ ప్రాంతాల్లో గురువారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

'ఫ్యాన్'కు ఓటేద్దాం.. అభివృద్ధిని కొనసాగిద్దాం



సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు, కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి తదితరులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం సీ–అపార్ట్‌మెంట్‌లో కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో రూ.435 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. రూ.1,500 కోట్ల పెట్టుబడులతో ఇనార్బిట్ మాల్, ఐటీ టవర్స్, కన్వెన్షన్ సెంటర్ తీసుకొచ్చామని చెప్పారు. 18 వేల మంది స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అభివృద్ధి కొనసాగాలంటే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జి.వి.రమణి, కర్రి మురళీకృష్ణారెడ్డి, వార్డు అధ్యక్షుడు గుడ్ల అశోక్‌రెడ్డి, గామ పెద్దలు పాల్గొన్నారు.

జగన్ పాలనలో ముస్లింలకు సముచిత స్థానం



ముస్లింల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బొత్స ఝాన్సీ, కె.కె.రాజు

తాటిచెట్లపాలెం: రాష్ట్రంలోని ముస్లింలు, మైనారిటీలకు సముచిత స్థానం కల్పించి, రాజకీయంగా పలు పదవుల్లో నియమించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ తెలిపారు. వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి ఐ.హెచ్.ఫరూఖీ ఆధ్వర్యంలో బుధవారం టీఎస్ఎన్ కాలనీలోని సింకా గ్రౌండ్‌లో ముస్లిం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులు హాజరైన బొత్స ఝాన్సీ, ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు మాట్లాడుతూ ముస్లింలను సీఎం జగన్ అన్ని విధాలుగా ఆదుకున్నారన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసకునేందుకు వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తమ గెలుపు కోసం ప్రతీ నాయకుడు కృషి చేయాలని కోరారు. సమావేశంలో 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ ఆలీ, కె.కె.బాబా, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

ప్రచార పర్వం



వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజులను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరుతూ బుధవారం 51వ వార్డు వుడా కాలనీలో ప్రచారం చేస్తున్న ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పేరికె వరప్రసాద్, బిషప్ బాలరాజు, వార్డు నాయకులు – మద్దిపాలెం



43వ వార్డు వెంకటేశ్వర కాలనీ, నరేంద్రనగర్ ప్రాంతాల్లో ఈవీఎం ద్వారా ఓటు వేసే విధానంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ – సీతంపేట



ఎమ్మెల్యేగా కె.కె.రాజును, ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరుతూ 45వ వార్డులో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ కంపా హనోకు, వార్డు అధ్యక్షుడు పైడి రమణ, ఇన్‌చార్జి ప్రవీణ్‌వర్మ తదితరులు – తాటిచెట్లపాలెం



51వ వార్డు గాంధీనగర్, కళింగనగర్‌లో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ నమూనా ఈవీఎం ద్వారా ఓటు ఎలా వేయాలో వివరిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ – మద్దిపాలెం

